క్లుప్తంగా

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

గుర్రంకొండ: మండలంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేస్తున్నట్లు వాల్మీకిపురం ట్రాన్స్‌కో ఏడీఏ శివయ్య తెలిపారు. మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక 33/11కేవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా బుధవారం కొన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో వ్యవసాయానికి అందించే విద్యుత్ సరఫరా వేళలు మార్పు చేశామన్నారు. సంగసముద్రం, సరిమడుగు ఫీడర్లలో బుధవారం ఉదయం 3 గంటల నుంచి 7 గంటల వరకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుర్రంకొండ పట్టణంలో అప్పుడప్పుడు విద్యుత సరఫరాకు అంతరాయం కలగవచ్చన్నారు. రైతులు మారిన సరఫరా వేళలు గమనించుకోవాలన్నారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈ మౌసీన్ పాల్గొన్నారు.

ఘనంగా అంకాలమ్మ ఊరేగింపు

పీలేరు : స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసిన శ్రీ రౌద్రాల అంకాలమ్మ అమ్మవారి గంగజాతరలో భాగంగా చివరి మంగళవారం అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం అమ్మవారిని మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు.

కార్మికుల హక్కులు కాపాడాలని వినతి

మదనపల్లె: వ్యవసాయ కార్మికుల హక్కులు కాపాడాలని కోరుతూ మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నేతలు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్ప మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి, కార్మికుల సాధికాత కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంక్షేమం కోసం చట్టబద్ధమైన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనులు, కార్మికులకు భూ పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాంబశివ, చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెప్ప, తిరుమల, ముబారక్, రమణమ్మ పాల్గొన్నారు.

భూ వివాదంలో దంపతులపై దాడి

– మహిళకు తీవ్ర గాయాలు


దాడిలో తీవ్రంగా గాయపడిన అమరావతి

మదనపల్లె రూరల్ : భూ వివాదం కారణంగా దంపతులపై దాడి చేసిన ఘటన మంగళవారం కురుబలకోట మండలంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాలిలా... నందిరెడ్డిగారిపల్లి పంచాయతీ, బండపల్లి కి చెందిన శ్రీనివాసులురెడ్డి, వెంకటరామిరెడ్డి అన్నదమ్ములు. వీరికి గ్రామంలో 7.10 ఎకరాల పొలం ఉంది. అయితే అన్నదమ్ముల మధ్య పొలం బాగా పరిష్కారం కాకపోవడంతో శ్రీనివాసులురెడ్డి సర్వే నిమిత్తం చలానా కట్టాడు. ఈ క్రమంలో మంగళవారం భూమి సర్వే చేసేందుకు అధికారులు రాగా, అన్నదమ్ముల మధ్య మరోసారి వివాదం ఏర్పడి వాగ్వాదానికి దారితీసింది. ఆగ్రహించిన వెంకటరమణారెడ్డి, భార్య లక్ష్మీదేవి, కుమారులు చంద్రశేఖర్ రెడ్డి, శివకష్ణారెడ్డి కర్రలు, రాడ్లతో శ్రీనివాసులు రెడ్డి అతని భార్య అమరావతి(44)పై దాడి చేశారు. ఈ దాడిలో అమరావతికి చేయి విరిగి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన బాధితురాలిని కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

20 లీటర్ల నాటుసారా స్వాధీనం


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ యల్లయ్య

కలకడ : మండలంలో 20 లీటర్లు నాటుసారా సీజ్‌చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు రాయచోటి ఇఎస్‌టిఎఫ్ సీఐ (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్) యల్లయ్య తెలిపారు. సీఐ కథనం మేరకు.. మంగళవారం కలకడ మండలం బాలయ్యగారిపల్లె పంచాయతీ సుగాలి కాలనీలో నాటుసారా విక్రయిస్తున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు సిబ్బంది మోహన్‌రెడ్డి, హుస్సేన్, బాలక్రిష్ణ, జానిఫ్‌లతోక లిసి దాడులు నిర్వహించామన్నారు. సుగాలికాలనికి చెందిన కృష్ణనాయక్ కుమారుడు బి.రాజానాయక్ వద్ద నిల్వ ఉన్న 20 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకొని అతడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సారా తయారు చేసినా, విక్రయించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గిజిగాడి గూడు.. నైపుణ్యం చూడు


చెట్టు కొమ్మలకు కట్టిన గూళ్లు


గూడులో గిజిగాడు పక్షి

అత్యద్భుతమైన ఇంజినీరింగ్ నైపుణ్యంతో 'గిజిగాడు పక్షి' నిర్మించిన వేలాడే గూళ్లు చూపరులను అబ్బురపరుస్తున్నాయి. మదనపల్లె మండలం చీకలబైలు సమీపంలోని అటవీ ప్రాంతంలో ఓ వ్యవసాయబావికి ఆనుకుని ఉన్న చెట్లకొమ్మలకు ఏర్పాటు చేసుకున్న గూళ్లు ఆ దారి వెంట వెళ్తున్న వీక్షకులకు కనువిందు చేస్తున్నాయి. ఈ పక్షిజాతిలో మగపక్షి మాత్రమే చక్కని ఇంజినీరింగ్ ప్రతిభతో అందంగా గూడును అల్లి ఆడ గిజిగాడిని ఆకర్షిస్తుంది. ఆడపక్షికి ఆ గూడు నచ్చితే అందులో అవాసం ఏర్పరుచుకుని మగపక్షితో సహవాసం చేస్తూ జీవనం గడుపుతుంది.

ఎంతో నేర్పరితనం

గిజిగాడు కట్టే గూడు ఎంతో నేర్పరితనం కలిగి ఉంటుంది. గూళ్లు అల్లడం, పిల్లలకు ఆహారం నోటికి అందించడం, శత్రువులను ఎదుర్కోవడం, పాములు, ఇతర శత్రువుల బారి నుంచి గుడ్లనూ పిల్లల్నీ కాపాడుకోవడానికి గూళ్లను ముళ్ల చెట్లపైన, నీటికి దగ్గరగా కిందకు వేలాడేరీతిలో కట్టుకోవడం వీటి అద్భుతతమైన తెలివికి నిదర్శనం. వెల్‌విషర్స్ ట్రెక్కర్స్ గిజిగాడిగూళ్లకు తమ కెమెరాలో బంధించారు. వీటిని చూసిన పక్షిప్రేమికులు ఎంతో ఆనందపడుతున్నారు.

– మదనపల్లె సిటీ

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


సంగసముద్రంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజానాయక్

గుర్రంకొండ: టమాటా, వేరుశగన పంటల సాగులో సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించడం వలన అధిక పంట దిగుబడి సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం కలికిరి సమన్వయకర్త మంజుల, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రాజానాయక్‌లు అన్నారు. మంగళవారం మండలంలోని సంగసముద్రం రైతు సేవా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వేరుశనగ పంటసాగులో భాగంగా పంట పూత సమయంలో ఎకరానికి 200 కేజీల జిప్సం వేయడం వలన కాయగట్టిపడడంతో పాటు గింజలో నూనె శాతం పెరుగుతుందన్నారు. జింక్ సల్ఫేట్ ఎకరానికి 20 కేజీలు ఆఖరు దుక్కుల సమయంలో వేసుకొంటే పంటలో జింక్ లోపం రాకుండా ఉంటుందన్నారు. వేరుశనగ పంట సాగు సమయంలో కేజి విత్తనాలకు 8.10 గ్రాముల ట్రైకోడార్మావిరిడి మందును కలిపి విత్తుకోవాలన్నారు. తద్వారా వేరు తొలుచు పురుగుల బెడద నివారించవచ్చన్నారు. పంటసాగు సమయంలో పంటకు కంచె మాదిరిగా రక్షణగా ఉండడం కోసం జొన్న, మొక్కజొన్న లేదా సజ్జ పంటలు వేసుకొవాలన్నారు. టమాటాలో సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించడం వలన బూడిద తెగులు, విల్ట్‌నత్తల రోగాల నివారణ సాధ్యమవుతుందన్నారు. వివిధ రకాల తెగుళ్ల నివారణ కొసం రెండు కేజీల ట్రైకోడార్మా విరిడి మందును 100 కేజీల పశువుల ఎరువులో కలిపి పంట దుక్కుల సమయంలొ వేసుకొవాలన్నారు. వరి, వేరుశనగ పంటల్లో నూతన వంగడాలు వచ్చాయని వాటి ద్వారా అధిక పంట దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో కేవికే కలికిరి శాస్త్రవేత్త మాధురి, ఏఓ నాగరత్నమ్మ, పశువైద్యాధికారి సునీల్‌నాయక్, వీహెచ్‌ఏ సమీనా, రైతులు పాల్గొన్నారు.

8 గంటల పని విధానం కొనసాగించాలి

- మంత్రి వర్గ నిర్ణయం వెనక్కు తీసుకోవాలి
- ఏఐటీయూసీ డిమాండ్


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె: 8 గంటల పని విధానం కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలపై వారు చర్చించారు. స్థానిక ఎస్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మంత్రి వర్గ నిర్ణయాలపై వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ కార్మికుల పని గంటల పెంపు నిర్ణయం దారుణమన్నారు. కార్మిక చట్టాలను మారుస్తూ తీసుకున్న నిర్ణయం తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులుగా పనిచేస్తున్న 50 లక్షల మందికి 13 ఏళ్లుగా కనీస వేతన సవరణ జరగలేదన్నారు. 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, వీరికి సంక్షేమ బోర్డును పునరుద్ధరించలేదన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కార్పొరేట్ల ప్రయోజనం కోసం చేస్తున్న నిర్ణయాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. మహిళా కార్మికుల రక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్మిక హక్కులను హరిస్తున్న బీజేపీ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగానే మంత్రి మండలి నిర్ణయాలు తీసుకొంటోందని విమర్శించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కృష్ణప్ప, ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్, మస్తాన్, ముబారక్, తిరుమల, దేవా, చలపతినాయుడు పాల్గొన్నారు.

కొమ్మినేని అరెస్టు వేధింపులకు పరాకాష్ట

– రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్



మదనపల్లె: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టుతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు రాజకీయాలు పరాకాష్టకు చేరాయని రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సాక్షి టీవీ డిబేట్ నిర్వహించినందుకు బాధ్యుడిగా చేసి అరెస్టు చేయడం పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమేనని అన్నారు. కేఎస్‌ఆర్ లైవ్ షో ద్వారా ప్రజల సమస్యలను కొమ్మినేని వివరిస్తున్నారని, డిబెట్ లో జర్నలిస్టు కృష్ణంరాజు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే కొమ్మినేనిని అరెస్ట్ చేయడం సబబేనా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం సాక్షి మీడియాపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఏపీలో మీడియా గొంతు నొక్కడమే లక్ష్యంగా మారిందన్నారు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా పట్టించుకోని పోలీసులు, కొమ్మినేని విషయంలో ఆగమేఘాలపై స్పందించడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం అర్థమవుతోందన్నారు. ఈనెల 3వ తేదీన అదృశ్యమైన ఇంటర్ విద్యార్థిని తన్మయి విషయంలో పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే తన్మయిని కాపాడగలిగేవారని అన్నారు. ప్రభుత్వం శాంతి భద్రతలను వదిలేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై కక్ష సాధింపులకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు.

సాక్షి కార్యాలయాలపై దాడి అమానుషం


మాట్లాడుతున్న సుంకర చక్రధర్

పీలేరు : సాక్షి కార్యాలయాలపై కూటమి నాయకులు దాడి చేయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకర చక్రదర్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడంలో ముందున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు గాలికొదిలేసి డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులపై, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. మరో అడుగు ముందుకేసి సాక్షి మీడియాపై దాడులు చేయడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు కిషోర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, భువనేశ్వర్‌రెడ్డి, జగ్గు, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు పెంచాలని ధర్నా


విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని బహుజన సేన ధర్నా

మదనపల్లె: ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న మెస్‌చార్జీలను పెంచాలని కోరుతూ మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట బహుజన సేన కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బహుజనసేన అధ్యక్షుడు శ్రీచందు మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం అందించాలని డిమాండ్ చేశారు. పదో తరగతి వరకు రూ.46, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు రూ.53 ఇవ్వడం సరిపోదని అన్నారు. తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకుని మెస్ చార్జీలను పెంచాలని కోరారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య అధ్యక్షులు దివాకర్, ఎస్ఎఫ్ఐ అధ్యక్షులఖు నరసింహులు, నాయీ బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు సుబ్రమణ్యం, సంఘాల నేతలు మల్లికా, వెంకట్ యాదవ్, మురళీ, మేరీ, మనోహర్‌రెడ్డి, జయశంకర్, హరిబాబు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె సిటీ: అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు విక్రయిస్తూ విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ డిమాండ్ చేశారు. మంగళవారం ఓ కార్పొరేట్ విద్యా సంస్థ ముందు ధర్నా చేశారు. ప్రభుత్వం అధికారంలోకి ఉందని ఈ విద్యా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. విద్యా సంస్థల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్,స్టేషనరీ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. విద్యా సంస్థలు ఈనెల 12తేదీ తెరవాల్సి వుండగా ముందుగానే పునః ప్రారంభించి వ్యాపారం చేస్తున్నారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి చర్యలు తీసుకోవాలన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణకు 230 దరఖాస్తులు


క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరురూరల్ : రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన జీఓ 30 కింద ఇళ్ల క్రమబద్ధీకరణకు మండలంలో 230 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ భీమేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం పీలేరు పట్టణంలోని ఆర్టీసీ నల్లగుట్ట, నాగిరెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో 40 దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 అక్టోబరు 15 మునుపు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నవారికి సంబంధిత రికార్డులు పరిశీలించి రెగ్యులరైజేషన్ చేయనున్నట్లు తెలిపారు. జూలై 1న రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో సిద్దయ్య, రెడ్డిశేఖర్, కళ్యాణి పాల్గొన్నారు.

ప్రతిభ అవార్డు గ్రహీతకు అభినందనలు



ప్రతిభ అవార్డు అందుకుంటున విద్యార్థిని ఏబీ ఇక్రా

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ సీనియర్ ఇంటర్మీడియట్ హెచ్‌ఈసీ విద్యార్థిని ఏబీ ఇక్రా కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతుల మీదుగా ప్రతిభ అవార్డు అందుకున్నారు. ఇంటర్‌లో 950 మార్కులు సాధించినందుకు ప్రతిభ అవార్డు అందజేశారు. మంగళవారం కాలేజీలో విద్యార్థిని కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి, అధ్యాపకులు అభినందించారు. కాలేజీలో ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు వచ్చాయని, విద్యార్థులు ప్రభుత్వ కాలేజీలో ఇంటర్మీడియట్ చేరించాలని ప్రిన్సిపాల్ కోరారు.

చదువుతోనే బాలికలకు భవిత

తంబళ్లపల్లె: బాలికలు చదువుకున్నప్పుడే వారి భవిత బంగారుబాట అవుతుందని మహిళా పోలీసు భారతి తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిషోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. కిషోర బాలికలకు చదువుతో కలిగే విలువలు గురించి వివరించారు. యుక్త వయస్సులో బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం,ఆరోగ్య అంశాలపై వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమా, సరస్వతి, చంద్రకళ,శోభ, శివమ్మ, ఫోర్డు ప్రతినిధులు నరసింహులు, రమణ, అనిత, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తన కాయలు పంపిణీ


వేరుశనగ విత్తన కాయల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా


రైతులకు వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నిమ్మనపల్లె : మండంలోని కందూరు రోడ్డులో ఉన్న గ్రామ సచివాలయం వద్ద మంగళవారం రైతులకు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేశారు. ఏడీఏ శివశంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలానికి కె-6 రకం 305 క్వింటాళ్లు, నారాయణ రకం 800 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు పంపిణీ చేస్తారన్నారు. అవసరమైతే మరిన్ని విత్తనకాయలను మంజూరు చేయిస్తామన్నారు. అదేవిధంగా రైతులకు భూసార పరీక్ష ఫలితాల కార్డులు, జిప్సం పచ్చిరొట్ట పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీపతి, నాయకులు రెడ్డప్పరెడ్డి, రాజన్న, మల్లికార్జున, దేవేందర్ రెడ్డి,సుధాకర్ , హార్టికల్చర్ అధికారి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విత్తనకాయలు సద్వినియోగం చేసుకోవాలి

పీలేరు : వేరుశనగ విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి రమాదేవి అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో రాయితీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025 ఖరీఫ్ సంవత్సరానికి 1644 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయడానికి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. 30 కేజీల బ్యాగ్ కే6 రకం రూ. 1674, నారాయణీరకం రూ. 1710గా ధర నిర్ణయించినట్లు తెలిపారు. రైతే సేవా కేంద్రాలలో రైతుల తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ వెంట తీసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మూర్తి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ విజయకుమారి, ఆర్టీసీ డీఎం నిర్మల

కేవీపల్లె : పీలేరు – సుండుపల్లె మార్గంలో నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించినట్లు పీలేరు మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ విజయకుమారి, ఆర్టీసీ డీఎం నిర్మల తెలిపారు. మంగళవారం మండలంలోని గరిమిట్ట వద్ద ఎంవీఐ, ఆర్టీసీ అధికారులు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓవర్‌లోడు, రికార్డులు సక్రమంగా లేని తొమ్మిది వాహనాలు గుర్తించి రూ. 56,510 జరిమానా విధించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీలు బాబునాయక్, హనీఫ్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూ పంపిణీ చేయాలని డిమాండ్

బి.కొత్తకోట: నిరుపేద వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం భూ పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ అజారుద్దీన్‌కు సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు నారాయణస్వామి, రఘునాధ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో 200 రోజుల పనిదినాలు కల్పించి వేతనం రూ.700 పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లోని వేతనాలను చెల్లించాలని కోరారు. కార్మికుల పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో తంబయ్యశెట్టి, శంకర, గంగన్న, ప్రసాద్, లక్ష్మన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో రాయితీ పాసులు ఇవ్వాలని వినతి

మదనపల్లె సిటీ: రైల్వేలో సీనియర్ సిటిజెన్స్‌కు రాయితీ పాసులు ఇవ్వాలని ఏపీ సీనియర్ సిటిజెన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.మునిగోపాలకృష్ణ ఆలిండియా సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు ఉన్నికి వినతిపత్రం అందజేశారు. ముంబైలో జరిగిన జాతీయ స్థాయి సీనియర్ సిటిజెన్స్ సెంట్రల్ కౌన్సిల్ సమావేశం ఆయన హాజరై పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. ఎంపీల ద్వారా రైల్వే మంత్రికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. రాష్ట్రంలోని సమస్యలను కూడా తెలియజేశారు.


ఆలిండియా సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు ఉన్నికి సమస్యలు వివరిస్తున్న మునిగోపాలకృష్ణ